క్లుప్తంగా

రాధాకృష్ణ మహోత్సవాల కరపత్రాల ఆవిష్కరణ



కరపత్రాలు విడుదల చేస్తున్న యాదవ సంఘం ప్రతినిధులు

మల్కాపురం: వచ్చే నెల 15న ఆర్‌కే బీచ్ సమీప గోకుల్ పార్కు వద్ద నిర్వహించనున్న రాధాకృష్ణ మహోత్సవాల కరపత్రాలను జిల్లా యాదవ సంఘం ప్రతినిధులు ఒమ్మి సన్యాసిరావు, బొట్ట వెంకటరమణ, ఉరుకూటి మహాలక్ష్మినాయుడు, పల్లా చిన్నతల్లి, తోనంగి వెంకటరమణి బుధవారం ఆవిష్కరించారు. ముందుగా కరపత్రాలను వినాయకుని పాదాల వద్ద ఉంచి పూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏటా పౌర్ణమి రోజున సాగరతీరంలో రాధాకృష్ణ మహోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ వేడుకలో జిల్లాలోని యాదవ కుల సభ్యులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

కంచరపాలెం: జోన్ – 2 డివిజన్ 11 కేవీ కంచరపాలెం ఫీడర్‌లో నిర్వహణ పనుల కారణంగా ఈ నెల 25న శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఈఈ బీకే నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు దయానందనగర్, పైడిమాంబకాలనీ, ఎఫ్‌సీఐ ఫుడ్ గొడౌన్స్, చాకలిగెడ్డ, ఆశవానిపాలెం, నేవల్ క్వార్టర్స్ తదితర ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని తెలిపారు.

నేటి నుంచి స్టీల్‌ప్లాంట్‌లో బాణసంచా విక్రయాలు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ కోఆపరేటివ్ స్టోర్స్ ఆధ్వర్యంలో బాణసంచా విక్రయాలు గురువారం ప్రారంభమవుతున్నాయని కోఆపరేటివ్ స్టోర్స్ అధ్యక్ష, కార్యదర్శులు డి.వి. నాగబాబు, ఆకుల నూకరాజు తెలిపారు. స్టోర్స్ కార్యాలయంలో బుధవారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. స్టీల్‌ప్లాంట్ ప్రస్తుత పరిస్థితితో పాటు ఉద్యోగుల ఇబ్బందులను అయ్యన్ సంస్థకు వివరించడంతో గతేడాది కంటే తక్కువ ధరలకు బాణ సంచా సరఫరా చేశారన్నారు. ఈనెల 31 వరకు ప్రతీ రోజు ఉదయం 9 నుంచి రాత్రి 8.30 గంటల వరకు అమ్మకాలు సాగుతాయన్నారు. సెక్టార్–5 అంబేడ్కర్ కళాక్షేత్రంలో స్టీల్‌ప్లాంట్ ఉద్యోగుల కోసం 7 కౌంటర్లు, ఇతరులకు 2 కౌంటర్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. సమావేశంలో ఉపాధ్యక్షుడు జి. నాగభూషణం, డైరక్టర్లు బి.టి. జగదీష్, ఎ.వి. జగదీశ్వరరావు, ఎ.వి. సత్యనారాయణ, ఈ.లోకేష్, ఎస్. భాను, కె. శ్రీనివాస్, పి.ఆర్.కె.రావు పాల్గొన్నారు.

వివాహిత ఆత్మహత్య

పెదగంట్యాడ: మండలంలోని భానోజీతోటలో ఉంటున్న ఓ వివాహిత మంగళవారం రాత్రి ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. న్యూపోర్టు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. లంక మల్లిక (38) ముగ్గురు పిల్లలతో కలసి తల్లి లంక లత వద్ద భానోజీతోటలో నివాసం ఉంటోంది. 2005లో ఎండీ రజాక్ అనే వ్యక్తితో ఆమెకు వివాహమైంది. 2010లో మల్లిక భర్తతో విడిపోయి ముగ్గురు పిల్లలతో కలసి తల్లి వద్దకు వచ్చేసింది. తర్వాత ఆమె ఓ ప్రైవేటు సంస్థలో పని చేసేది. మూడేళ్ల కిందట ఆ ఉద్యోగం మానేసింది. తర్వాత ఆమె విశాఖనగరంలోని పాత పోస్టాఫీసు ప్రాంతానికి చెందిన గణేష్ అనే వ్యక్తితో పరిచయం పెంచుకుంది. ఈ నేపథ్యంలో మంగళవారం ఉదయం లతకు ఆరోగ్యం బాగా లేకపోవడంతో పోము (తావీదు) కట్టించుకునేందుకు తల్లి లత, కుమార్తె రిజ్వానతో కలసి జీవీఎంసీ 77వ వార్డు పరిధిలోని పెదపాలెం వెళ్లింది. సాయంత్రం వారు ఆటోలో తిరిగి వస్తుండగా జగ్గు జంక్షన్ వద్ద ఆటో దిగిపోమని గణేష్ నుంచి మల్లిక ఫోన్‌కు మెసేజ్ రావడంతో అక్కడ దిగిపోయింది. తర్వాత ఆమె రాత్రి 7.30 గంటల సమయంలో ఇంటికి చేరుకుంది. ఇంతలో ఏమైందో ఏమో కానీ ఇంట్లోని ఓ గదిలో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. వెంటనే మృతురాలి తల్లి లత గమనించి న్యూపోర్టు పోలీసులకు సమాచారం అందజేసింది. పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు.

ప్రజారోగ్యం పట్టదా!

- మంచినీటి ట్యాంకుల నిర్వహణలో మహా నిర్లక్ష్యం
- మూలకు చేరిన ఫైలట్ వాటర్ స్కీమ్
- విరిగిన మెట్ల మార్గం
- ఊడుతున్న కోలమ్స్ పెచ్చులు
- ట్యాంకు శుభ్ర పరచడం గగనమే



పాత చెక్‌పోస్టు ఏరియాలోని భారీ రిజర్వాయర్



విరిగిన మెట్ల మార్గం

మల్కాపురం: పారిశ్రామిక ప్రాంత వాసుల దాహార్తి తీర్చుతున్న భారీ రిజర్వాయర్ (వాటర్ ట్యాంక్) నిర్వహణలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ట్యాంకు శిథిలావస్థకు చేరినా.. కోలమ్స్ పెచ్చులు ఊడి,మెట్లు విరిగి పోయినా చలనం లేదు. ట్యాంకుకు పలు చోట్ల బీటలు వారడంతో ప్రమాదం పొంచిఉంది. అధికారులు సమస్యను గుర్తించి మరమ్మతులు చేపట్టకపోతే పెను ప్రమాదం తప్పదు.

ఇదీ పరిస్థితి

పారిశ్రామిక ప్రాంతంలోని జీవీఎంసీ 58 నుంచి 63వ వార్డుల ప్రజల నీటి అవసరాల కోసం 59వ వార్డు పాతచెక్‌పోస్టు ఏరియాలో 1978లో సుమారు 800 కేఎల్ నీటిని స్టోర్ చేసే సామర్థ్యంతో కూడిన భారీ రిజర్వాయర్ (వాటర్ ట్యాంక్)ను ఏర్పాటు చేశారు. మింది రిజర్వాయర్ నుంచి భూ గర్భ మార్గాన ఇక్కడ రిజర్వాయర్‌కు నీటిని నిత్యం పంప్ చేస్తుంటారు. ఇక్కడ నుంచి పారిశ్రామిక ప్రాంతంలోని పలు వార్డుల్లో గల మినీ రిజర్వాయర్లకు నీటిని పంప్ చేస్తుంటారు.

ఆలనా పాలనా కరువు

అయితే పాతచెక్‌పోస్టు వద్ద గల భారీ రిజర్వాయర్ నిర్మించి సుమారు 40 ఏళ్లు కావస్తోంది. రిజర్వాయర్ ఆలన పాలనా చూసే నాథుడు లేకపోవడంతో ప్రస్తుతం శిథిలావస్థకు చేరింది. ట్యాంక్ దిగువ కాలమ్స్ పెచ్చులు ఊడి,ఇనుప రాడ్‌లు కనిపిస్తున్నాయి. ట్యాంక్ లోపల భాగం శుభ్ర పరిచేందుకు వెళ్లే మెట్ల మార్గం విరిగిపోయింది. దీంతో ట్యాంక్ పైకి వెళ్లాలంటే ఇక్కడ సిబ్బంది సాహస యాత్ర చేయాల్సిన పరిస్థితి ఉంది.ట్యాంక్ చుట్టూ కొంత భాగం బీటలు వారినట్టు కనిపిస్తోంది. ఇక్కడ రిజర్వాయర్ పరిస్థితిని చూసి పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లినా..

అధికారులు ఎమ్మెల్యే గణబాబుకు రిజర్వాయర్ పరిస్థితిని వివరించినా ఫలితం లేదు. మరమ్మతులకు సంబంధించి ఎలాంటి చర్యలు కానరాలేదు.

శుభ్రపరిచేదెలా..?

మరో వైపు రాష్ట్ర వ్యాప్తంగా డయేరియా విజృంభిస్తున్న నేపథ్యంలో ట్యాంకు శుభ్రతపై కూడా సందేహాలు తలెత్తుతున్నాయి. మెట్ల మార్గం శిథిలమవడంతో ట్యాంకును శుభ్రం చేయడానికి సిబ్బంది వెళ్లాలన్నా సాహసమే చేయాలి. ఈ పరిస్థితి చూసిన వారు ట్యాంకు శుభ్రతపై అనుమానం వ్యక్తం చేస్తున్నారు.



పెచ్చులూడి బయటకు వచ్చిన కోలమ్స్ రాడ్‌లు

ప్రమాదకరంగా వాటర్ ట్యాంకు



పాతచెక్‌పోస్టు ఏరియాలోని భారీ రిజర్వాయర్‌ను చూస్తే భయం వేస్తుంది.ఇది ఎప్పుడు కూలుతుందో అన్న ఆందోళన కలుగుతుంది.40 ఏళ్ల కిందట నిర్మించిన రిజర్వాయర్ దుస్థితి చూసి కనీసం మరమ్మతులు చేపట్టినా బాగుంటుంది.దీనిపై అధికారులు స్పందించాలి.

– ఆదారి హరీష్, యువజన నాయకుడు

రిజర్వాయర్‌కు ఏమైనా అయితే నీటి కష్టాలే



శిథిలావస్థలో ఉన్న రిజర్వాయర్‌కు తక్షణం మరమ్మతు పనులు చేపట్టాలి. అది ఏమైనా ప్రమాదానికి గురైతే పారిశ్రామిక వాసులకు నీటి కష్టాలు తప్పవు. అధికారులు, పాలకులు సమస్యపై స్పందిస్తారని ఆశగా ఎదురు చూస్తాం.

–చట్టి వినయ్‌కుమార్ ,స్థానికుడు

ప్రైవేట్ దుకాణాలకు సబ్సిడీ ఉల్లి, టమాటా!

రైతు బజార్ సిబ్బంది పర్యవేక్షణ కరవు



రైతుబజార్‌లో టమాటా కౌంటర్

గాజువాక: గాజువాక మహిళా రైతు బజార్ నుంచి సబ్సిడీ ఉల్లిపాయలు, టమాటాలు ప్రైవేట్ దుకాణాలకు తరలిపోతున్నాయి. ప్రజలకు అందాల్సిన ఈ రెండు వస్తువులు ప్రైవేట్ వ్యాపారుల గుప్పెట్లోకి పోతున్నాయి. దీన్ని అడ్డుకోవాల్సిన సిబ్బంది పని భారం పేరుతో పర్యవేక్షణకు దూరంగా ఉంటున్నారు. ఫలితంగా రైతు బజార్‌కు వస్తున్న కొనుగోలుదారులు తగినన్ని ఉల్లిపాయలు, టమాటాలు లభించక దొరికినవాటితో తిరిగి వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది.

ధరలు పెరగడంతోనే...

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నిత్యావసరాలు, కూరగాయల ధరలు చుక్కలనంటిన విషయం తెలిసిందే. రైతు బజార్‌లో కిలో టమాటా రూ.48కి, కిలో ఉల్లిపాయలు రూ.54కు విక్రయిస్తుండగా, ప్రైవేట్ మార్కెట్‌లో వాటిని కిలో రూ.70 చొప్పున విక్రయిస్తున్నారు. దీంతో టమాటా, ఉల్లిపాయల కోసం రైతు బజార్‌కు జనం క్యూ కడుతున్నారు. దీన్నే అదనుగా భావించిన ప్రైవేట్ కూరగాయల వ్యాపారులు రైతు బజార్‌లోని ఉల్లి, టమాటా వ్యాపారులతో కుమ్మక్కై వాటిని కొనుగోలు చేసేస్తున్నారు. రైతు బజార్‌లో నిర్ణయించిన ధరకంటే ఎక్కువ వస్తుండడంతో ఆ వ్యాపారులు కూడా ప్రైవేట్ వ్యాపారులకే అమ్మేస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రైవేట్ వ్యాపారులు సబ్సిడీ ఉల్లిపాయలు, టమాటాలతో పాటు కూరగాయలను బల్క్‌గా తరలించడంతో రైతు బజార్ స్టాళ్లలో కూరగాయలు లభించడంలేదని వినియోగదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



గాజువాక మహిళా రైతు బజార్‌లో ఉల్లిపాయల కౌంటర్ వద్ద రద్దీ

అడ్డుకొంటున్నాం

ప్రైవేట్ వ్యాపారులకు సబ్సిడీ ఉల్లిపాయలు, టమాటాలు విక్రయించకుండా సాధ్యమైనంత వరకు అడ్డుకొంటున్నాం. మాకు పర్యవేక్షణతోపాటు అడ్మినిస్ట్రేటివ్ పనులు కూడా చాలా ఉంటున్నాయి. దీంతో కార్యాలయంలో కూర్చొని ఆ పనులు చేస్తున్న సమయంలో ప్రైవేట్ వ్యాపారులు వచ్చి కొనుగోలు చేసే అవకాశం ఉంది. ఎవరైనా పెద్ద బ్యాగులతో ఉల్లి, టమాటాలు తీసుకెళ్తే తనిఖీ చేస్తున్నాం. ఉదయం 10 గంటల వరకు ఏ సరుకైనా స్టాళ్ల ద్వారా ప్రజలకే నేరుగా అమ్మాలని ఆదేశాలు కూడా ఇచ్చాం. దీనిపై మరింత పర్యవేక్షణ పెంచుతాం.

–హరిత,ఈవో, గాజువాక మహిళా రైతు బజార్

బహిరంగ ప్రదేశాల్లో మందుబాబుల చిందులు



మల్కాపురం సోనా హోటల్ ఎదురుగా ఫుట్‌పాత్‌పై మద్యం సేవిస్తున్న వ్యక్తులు



పాత పెట్రోల్ బంక్ వద్ద మద్యం సేవిస్తున్న వ్యక్తులు

హడలిపోతున్న మహిళలు, స్థానికులు

మల్కాపురం : కూటమి ప్రభుత్వం దయవల్ల మద్యం విచ్చలవిడిగా దొరకడంతో మందుబాబులు బహిరంగ ప్రదేశాల్లో తాగి చిందులేస్తున్నారు. రోడ్డు, షాపు అన్న తేడా లేకుండా ఎక్కడపడితే అక్కడ మద్యం తాగుతూ... అక్కడే బాటిళ్లు, గ్లాసులు, తదితర సామగ్రి వదిలేసి చిందరవందర చేసేస్తున్నారు. దీనిపై స్థానిక దుకాణదారులు, ఆ మార్గన రాకపోకలు సాగించే వారు ప్రశ్నిస్తే మందుబాబులు గొడవకు దిగుతూ దాడి చేస్తున్నారు. ఈ సమస్య జీవీఎంసీ 61వ వార్డు పరిధి మల్కాపురంలో ఎక్కువగా ఉంది. ఇక్కడి ప్రధాన సేవా మార్గానికి అనుకుని ఇటీవల కేటాయించిన రెండు మద్యం దుకాణాలు ఏర్పాటు చేశారు. అక్కడికి సమీపంలోనే గతంలో ఏర్పాటు చేసిన ఓ బార్ అండ్ రెస్టారెంట్ ఉన్నాయి. మొత్తంగా ఈ ప్రాంతంలో విచ్చలవిడిగా మద్యం దొరకడంతో కొనుగోలు చేసి ఆ షాపుల పక్కనే గల ఫుట్‌పాత్‌లపై, సమీపంలోని వాణిజ్య దుకాణాల ముందు రాత్రీపగలు అన్న తేడా లేకుండా మందుబాబులు తాగుతున్నారు. మంగళవారం రాత్రి చాలా మంది మందుబాబులు మల్కాపురం సేవా మార్గంపై, స్థానిక బుక్ స్టాల్ వద్ద, సోనా హోటల్ ముందు ఫుట్‌పాత్‌పై, ఆర్ కేపురం పాత పెట్రోల్ బంక్ వద్ద ఓ భవనం ముందు మద్యం సేవిస్తూ కనిపించారు. ఆ సమయంలో వీరిని ప్రశ్నించిన వారిపై దాడి చేశారని పలువురు ఆరోపిస్తున్నారు. పోలీసుల గస్తీ లేకపోవడంతో ఇలాంటి సమస్య ఎదురవుతోందని సేవా మార్గానికి ఆనుకుని ఉన్న వాణిజ్య దుకాణాల యజమానులు ఆవేదన చెందుతున్నారు. పోలీసులు ఇప్పటికైనా గస్తీ ముమ్మరం చేయాలని, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించే వారిపై చర్యలు తీసుకోవాలని మహిళలు, స్థానికులు కోరుతున్నారు.

భెల్ ఉద్యోగులకు దీపావళి బోనస్

అక్కిరెడ్డిపాలెం: న్యూఢిల్లీలో భెల్ కార్పొరేట్ యాజమాన్యం, జాతీయ కార్మిక సంఘాల నేతల సమక్షంలో దీపావళి బోనస్‌పై చర్చలు జరిగాయని భెల్ (హెచ్‌పీవీపీ) సీఐటీయూ నాయకుడు ఎస్.జగన్నాథరావు బుధవారం తెలిపారు. చర్చల్లో భెల్ జేఏసీ చైర్మన్, ఇంటక్ ఆల్ ఇండియా అధ్యక్షుడు జి.సంజీవరెడ్డి, జేఎస్‌సీ సభ్యులు, సీఐటీయూ ఆల్ ఇండియా ప్రధానకార్యదర్శి తపన్ సేన్, ఇతర కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారని చెప్పారు. ప్రతీ ఉద్యోగికి దీపావళి బోనస్‌గా రూ.25 వేల చొప్పున ఈ నెల బ్యాంకు ఖాతాల్లో జమచేయబడుతుందని తెలిపారు.

బాలిక మిస్సింగ్ కేసు ఛేదించిన పోలీసులు



బాలికను తల్లిదండ్రులకు అప్పగిస్తున్న ఎస్ఐ రామకృష్ణ

విశాఖ విద్య: బాలిక మిస్సింగ్ కేసును గోపాలపట్నం పోలీసులు చాకచక్యంగా ఛేదించారు. పోలీసులు తెలిపిన వివరాలు.. సింహాచలం గోశాల ఏరియాలో నివసిస్తున్న సోమల తవశి తరచూ సెల్‌ఫోన్ చూస్తుండడంతో తల్లిదండ్రులు మందలించారు. ఇంటి వద్దనే ఉంటున్న ఆ బాలిక ఎక్కువ సమయం ఫోన్‌లోనే గడుపుతుండటంపై గుర్తించిన తల్లిదండ్రులు తీరు మార్చుకోవాలని సూచించారు. ఆ కోపంతో ఆ బాలిక ఈ నెల 20న ఇంటి నుంచి వెళ్లిపోయింది. బాలిక తల్లిదండ్రులు గోపాలపట్నం పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై మిస్సింగ్ కేసు నమోదు చేసిన పోలీసులు బాలిక గురించి పూర్తి స్థాయిలో ఆరా తీశారు. సీఐ సూచనలతో ఎస్ఐ రామకృష్ణ ప్రత్యేక శ్రద్ధ తీసుకొని సిబ్బందితో గాలింపు చర్యలు చేపట్టారు. బాలిక ఉపయోగిస్తున్న ఫోన్ సిగ్నల్ ఆధారంగా ఆమె ఉన్న చోటకు వెళ్లి స్టేషన్‌కు తీసుకొచ్చారు. బుధవారం వారి తల్లిదండ్రులను పిలిపించి వారి సమక్షంలో బాలికకు కౌన్సెలింగ్ ఇచ్చి వారితో పంపించారు. బిడ్డను సకాలంలో గుర్తించి క్షేమంగా ఇంటికి చేర్చిన పోలీసులకు బాలిక తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.

విదేశీ విద్యార్థుల హాస్టల్ సందర్శన



ఏయూ రిజిస్ట్రార్ ధనుంజయరావుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న సిబ్బంది

విశాఖ సిటీ: ఆంధ్ర విశ్వవిద్యాలయం విదేశీ విద్యార్థుల హాస్టల్‌ను బుధవారం మధ్యాహ్నం ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్.ధనంజయరావు సందర్శించారు. ఈ సందర్భంగా హాస్టల్స్‌లో కల్పిస్తున్న సదుపాయాలను విద్యార్థులను అడిగి ఆయన తెలుసుకున్నారు. విద్యార్థులతో కలిసి అక్కడే భోజనం చేశారు. ఏయూ పూర్తి స్థాయిలో విద్యార్థులకు సహకారం అందిస్తూ పరిపాలన సాగిస్తోందని చెప్పారు. విద్యార్థులకు ఎటువంటి సహాయం అవసరమైన వెంటనే తమను సంప్రదించాలని సూచించారు. ఇటీవల కాలంలో హాస్టల్స్‌లో చేపట్టిన మరమ్మతులు, నిర్వహించిన అభివృద్ధి కార్యక్రమాలను చీఫ్ వార్డెన్ డాక్టర్ ఎస్.ఎం.యుగంధర్ వివరించా రు. హాస్టల్ అభివృద్ధికి అవసరమైన సంపూర్ణ సహ కారాన్ని సత్వరమే అందిస్తామని రిజిస్ట్రార్ తెలిపారు. అకడమిక్ డీన్ ఆచార్య కె.ఈశ్వర్‌కుమార్, దూర విద్య సంచాలకుడు ఆచార్య ఎన్.వి జయమోహన్, డీసీఎంఎస్ విభాగాధిపతి ఆచార్య జాలాది రవి, డాక్టర్ సిహెచ్. ఆశ ఇమ్మానియల్ రాజు, డీన్లు ఆచార్య భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

కార్మికుల వేతనాలు పెంచకుంటే ఉద్యమిస్తాం



కార్యక్రమంలో మాట్లాడుతున్న జేవీ సత్యనారాయణ

మల్కాపురం: కోరమాండల్ పరిశ్రమలో పని చేస్తున్న కాంట్రాక్ట్ కార్మికుల వేతనాలు తక్షణమే పెంచాలని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జె.వి.సత్యనారాయణ డిమాండ్ చేశారు. కార్మికుల వేతన సమస్యపై కోరమాండల్ గేటు వద్ద బుధవారం ఉదయం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంస్థలో పని చేస్తున్న పలువురు కాంట్రాక్ట్ కార్మికులకు ఏడు సంవత్సరాల క్రితం వేతనాలు పెంచుతామని యాజమాన్యం ఒప్పందం కుదుర్చుకుందన్నారు. ఆ ఒప్పందం నేటికీ అమలు చేయకపోవడం దారుణమన్నారు. ప్రస్తుతం నిత్యావసర సరకుల ధరలు పెరిగిపోవడంతో కొనుగోలు చేయలేక కార్మికుల కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మరోవైపు కాంట్రాక్ట్ కార్మికులకు సంస్థ క్యాంటీన్‌లో సరైన భోజన సదుపాయం కూడా కల్పించడం లేదని, దీనివల్ల వారు అనారోగ్యానికి గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా యాజమాన్యం స్పందించి కాంట్రాక్ట్ కార్మికులకు సీనియారిటీ ప్రకారం ప్రమోషన్లు ఇవ్వాలని, వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. సానుకూలంగా స్పందించి న్యాయం చేయకుంటే తీవ్రంగా ఉద్యమిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా నాయకుడు కసిరెడ్డి సత్యనారాయణ, సీపీఐ జిల్లా కార్యదర్శి గుడాల బాబూరావు, నూనెల సూరిబాబు, సత్యనారాయణరెడ్డి, కొయిలాడ శంకరావు పాల్గొన్నారు.

దళిత యువకుడి హంతకులను శిక్షించాలి



మాట్లాడుతున్న గొల్లమాల అప్పారావు, దళిత సేన నాయకులు

కంచరపాలెం: దళిత యువకుడి హత్య కేసులో నిందితులకు శిక్ష పడేలా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని దళిత సేన రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గొల్లమాల అప్పారావు డిమాండ్ చేశారు. ఈ మేరకు కంచరపాలెం పరిధి ఊర్వశి కూడలి దళిత సేన కార్యాలయం వద్ద బుధవారం నిరశన తెలిపారు. అనంతరం అప్పారావు మాట్లాడుతూ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వలంటీర్ అయినవిల్లి వాసు అనే దళిత యువకుడిని ప్లాన్ ప్రకారం హత్య చేసి తప్పించుకుంటున్న ప్రధాన నిందితుడిని అరెస్ట్ చేసి కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో దళిత సేన నగర అధ్యక్షుడు పుచ్చా కామేశ్వరరావు, గొల్లమాల మీనా, పట్నాల ఝాన్సీ, లంకా రామారావు, సీతారామ్, రాంజీ అభ్యుదయ సేవా సంఘం సభ్యులు పాల్గొన్నారు.

భర్త అదృశ్యంపై ఫిర్యాదు



అదృశ్యమైన దుర్గాప్రసాద్

డాబాగార్డెన్స్: మల్కాపురం ప్రాంతానికి చెందిన తన భర్త దుర్గాప్రసాద్ ఈ నెల 11 నుంచి కనిపించడం లేదని జి. నీలిమ బుధవారం వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు తెలిపిన వివరాలివి. మల్కాపురం ప్రాంతానికి చెందిన దుర్గాప్రసాద్ తన కుమార్తె కృప అనారోగ్య కారణంగా ఈ నెల 2న కేజీహెచ్‌లో జాయిన్ చేయించారని, చికిత్స అనంతరం ఈ నెల 11న డిశ్చార్జి ఇచ్చారని తెలిపింది. డిశ్చార్జి సమయంలో పాపను ఇంటికి తీసుకెళ్లమని, తాను వస్తానని చెప్పిన దుర్గాప్రసాద్ ఇంటికి చేరుకోకపోవడంతో ఆచూకీ కోసం పరిసర ప్రాంతాల్లో వెతికినా ఆచూకీ దొరకలేదని, బంధువులను కూడా సంప్రదించినా ఫలితం లేకపోయిందని తెలిపింది. ఈ నెల 13న భర్త ఫోన్‌కు ఎంత ట్రై చేసినా స్విచ్ ఆఫ్ రావడంతో అప్పటి నుంచి ఆచూకీ కోసం వెతకుతున్నట్లు తెలిపింది. పది రోజులైనా భర్త ఆచూకీ లేకపోవడంతో బుధవారం వన్‌టౌన్ పోలీసులకు ఆమె ఫిర్యాదు చేసింది. తన భర్త వయసు 37 ఏళ్లని, చామనఛాయిగా ఉంటారని, ఐదు అడుగుల ఎత్తు, రెండు చేతుల మీద టాటూస్ ఉంటాయని తెలిపింది.

విద్యార్థులు పోటీ పరీక్షల్లో రాణించాలి

ఎంఈవో సోమేశ్వరరావు



మెటీరియల్ అందుకున్న విద్యార్థులతో ఎంఈవో, హెచ్ఎం తదితరులు

విశాఖ విద్య: విద్యార్థులు పోటీ పరీక్షల్లో రాణించి, భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలని గోపాలపట్నం ఎంఈవో-1 అంబటి సోమేశ్వరరావు అన్నారు. బుచ్చిరాజుపాలెం జీవీఎంసీ అప్పర్‌ప్రైమరీ స్కూల్లో జాతీయ ప్రతిభాన్వేషణ పరీక్షకు సన్నద్ధమవుతున్న విద్యార్థులకు ఓ స్వచ్ఛంద సంస్థ సమకూర్చిన మెటీరియల్‌ను ఎంఈవో చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంఈవో సోమేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థులు పాఠశాల స్థాయి నుంచే పోటీ పరీక్షలపై అవగాహన పెంచుకోవాలన్నారు. జాతీయ ప్రతిభాన్వేషణ పరీక్షల్లో విజయం సాధిస్తే చదువు పూర్తయ్యేంత వరకు స్కాలర్ షిప్ అందుకోవచ్చన్నారు. పాఠశాల హెచ్ఎం సీహెచ్ నిర్మల మాట్లాడుతూ ఎన్ఎంఎంఎస్ పరీక్షకు హాజరయ్యే విద్యార్థులకు ప్రత్యేక తర్ఫీదు ఇస్తున్నామన్నారు. చదువుల్లో రాణించే విద్యార్థులకు తగిన ప్రోత్సాహం అందిస్తామన్నారు.

గోపాలపట్నం స్కూల్ పరిశీలన

సాక్షి ఎఫెక్ట్..



శుభ్రం చేసిన గదిని పరిశీలిస్తున్న ఎంఈవో దివాకర్

విశాఖ విద్య : గోపాలపట్నం ప్రాథమిక పాఠశాలను ఎంఈవో – 2 దివాకర్ బుధవారం సందర్శించారు. 'బడిలో సమస్యలు పట్టవా..?' శీర్షికతో ఈ నెల 22న సాక్షిలో ప్రచురితమైన కథనంతో విద్యాశాఖాధికారులు స్పందించారు. ఎంఈవో దివాకర్ పాఠశాలను సందర్శించి ఉపాధ్యాయులతో సమావేశమయ్యారు. పాఠశాల ప్రాంగణమంతా శుభ్రం చేయించారు. హెచ్ఎం గదిలో కింద కూర్చొన్న విద్యార్థులకు సమీపంలోని బల్లలు ఏర్పాటు చేయించారు. పై అంతస్తులో నిరుపయోగంగా ఉన్న సామగ్రి అంతటినీ శ్లాబ్ పైకప్పు తీసేసిన గదిలో ఉంచి, దానిలోకి విద్యార్థులెవ్వరూ వెళ్లకుండా తాళాలు వేయించారు. నాడు – నేడు కార్యక్రమంలో పాఠశాల భవనాలకు రంగులు వేసే పనులు మిగిలాయని, వాటిని పూర్తి చేసేలా ఉన్నతాధికారులకు నివేదించామని తెలిపారు. విద్యార్థుల చదువుకు ఆటంకం లేకుండా పాఠశాలల్లో తగిన ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. పరిశుభ్రమైన వాతావరణంలో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు.

కుటుంబాల చెంతకు నిరాశ్రయులు



కుటుంబాల చెంతకు తీసుకెళ్తున్న శ్రద్ధ ఫౌండేషన్ ప్రతినిధులు

విశాఖ విద్య: బుచ్చిరాజుపాలెం జీవీఎంసీ షెల్టర్‌లో ఆశ్రయం పొందిన నలుగురు వ్యక్తులను బుధవారం వారి కుటుంబాల చెంతకు పంపించే ఏర్పాట్లు చేశారు. కొన్ని రోజుల క్రితం ఫుట్‌పాత్‌ల మీద మతిస్థిమితం లేక తిరుగుతున్న వారిని బుచ్చిరాజుపాలెం జీవీఎంసీ షెల్టర్ మేనేజర్ ఎల్లెటి మమత తీసుకొచ్చి ఆశ్రయం కల్పించారు. ఆ నలుగురికి మెంటల్ కేర్ హాస్పిటల్‌లో వైద్యం అందించారు. వారు కోలుకున్న తర్వాత వివరాలు సేకరించారు. చొక్కటోడు (వెస్ట్ బెంగాల్), షరీఫ్ (ఉత్తరప్రదేశ్), కాశీరామ్ (ఉత్తరప్రదేశ్), రవి కుమార్ (ఉత్తరప్రదేశ్) వివరాలు సేకరించి శ్రద్ధా ఫౌండేషన్ సహాయంతో వారి కుటుంబ సభ్యుల వద్దకు మమత పంపించారు.